క్లుప్తంగా

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం



సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న నాయకులు

దౌల్తాబాద్: సీఎంఆర్ఎఫ్ పేదలకు వరమని కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు తిమిడెపల్లి వెంకటప్ప పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలో మంజూరైన చెక్కులను నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వెంకట్రావు ఆదేశాల మేరకు తలారి మల్కమ్మకు రూ.30వేల చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గోవిందురెడ్డి, జగన్, అంజి, గోపాల్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

బాధితుడికి రూ.2 లక్షల ఎల్ఓసీ అందజేత

బంట్వారం: అనారోగ్యంతో నిమ్స్ ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న బంట్వారం మండలం బస్వాపూర్ గ్రామానికి చెందిన తలారి గోవింద్‌కు రూ.2లక్షల ఎల్ఓసీ పత్రాన్ని బీజేపీ జిల్లా నాయకుడు బి.శ్రీకాంత్‌రెడ్డి గురువారం అందజేశారు. అడిగిన వెంటనే ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ఎల్ఓసీ మంజూరు చేయించారని ఆయన హర్షం వ్యక్తం చేస్తూ ఎంపీకి కృతజ్ఞతలు తెలిపారు.

పంటల నష్టపరిహారం అందజేయాలి

కొడంగల్ రూరల్: అకాల వర్షాలకు పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం అందజేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి గంటి సురేష్‌కుమార్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రైతులు పెట్టిన పెట్టుబడి వర్షాల వల్ల నీటిపాలైందన్నారు. పంటలు చేతికొచ్చే తరుణంలో అకాల వర్షంతో దెబ్బతీశాయని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయాధికారులచే పంటల వివరాలను నమోదు చేయించి నష్టపోయిన ప్రతీ రైతును ఆదుకోవాలని కోరారు.

వైద్య శిబిరాలను వినియోగించుకోవాలి

వైద్యాధికారి సుజల



మోమిన్‌పేట: వైద్య శిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

మోమిన్‌పేట: ఉచిత వైద్య శిబిరాలను వినియోగించుకోవాలని వైద్యాధికారి సుజల పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్వాతినారి స్వశక్త్ పరివార్ అభియాన్‌లో భాగంగా మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం నిర్వహిస్తున్న వైద్య శిబిరాలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ శిబిరంలో దీర్ఘకాలిక రోగాలకు కూడా వైద్య నిపుణులు సలహాలు, సూచనలు చేస్తారని ఆమె తెలిపారు. వైద్య పరీక్షలతో పాటు మందులను కూడా ఉచితంగా అందజేస్తారన్నారు. ఈ శిబిరంలో సుమారు 325మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు ఆమె తెలిపారు.

ఒకేషనల్‌లో శిక్షణ తరగతులు



సర్టిఫికెట్ అందజేస్తున్న ప్రిన్సిపాల్ అనీలా

బషీరాబాద్: ఒకేషనల్ విద్యార్థులకు ఎలక్ట్రానిక్ మెకానిజంలో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు బషీరాబాద్ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ అనీలా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎలక్ట్రానిక్, హార్డ్‌వేర్ కోర్సుల్లో ఇస్తున్న నైపుణ్య శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రెండు వారాల పాటు ఇంటర్న్‌షిప్ తరగతులు నిర్వహిస్తారని వివరించారు. పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారికి ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైనర్ నాగరాజు, టెక్నీషియన్ ఖాజాఖాన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు స్థానిక ఎన్నికలపై శిక్షణ

తాండూరు రూరల్: స్థానిక సంస్థల ఎన్నికల కసరత్తులో భాగంగా శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయం వద్ద ప్రొసీడింగ్ అధికారులకు శిక్షణ ఇవ్వనున్నట్లు ఎంపీడీఓ విశ్వప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సర్పంచు ఎన్నికలకు సంబంధించి 347 ప్రొసీడింగ్ అధికారులు, ఎంపీటీసీ ఎన్నికలకు సంబంధించి 90 మందికి శిక్షణ ఇస్తారని తెలిపారు.

ఇందిరమ్మ ఇల్లు.. ఫొటోతో బిల్లు

- నిర్మాణదారులకు చేకూరనున్న ప్రయోజనం
- వివరాల నమోదుకు యాప్‌లో కొత్త ఆప్షన్
- వేగంగా బిల్లుల మంజూరునకు చర్యలు
- హర్షం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు



దౌల్తాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకంలో బిల్లులను ఆలస్యం చేయకుండా విడుదలచేసేందుకు యాప్‌ను తీసుకొచ్చింది. ఈ విధానంతో నిర్మాణదారులకు ప్రయోజనం చేకూరనుంది. సదరు లబ్ధిదారు నిర్మాణ పనులకు సంబంధించి ఫొటోలు తీసి ఆయా వివరాలను యాప్‌లో నమోదు చేసేందుకు దీన్ని తీసుకువచ్చింది. బిల్లు ప్రతిపాదనలో జాప్యం నివారణ, ఇబ్బందులు దూరం చేసేందుకు ఫొటోలు అప్‌లోడ్ చేసే విధానాన్ని కల్పించింది. గతంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం మొదలైనప్పటి నుంచి వివిధ దశల్లో ఫొటోలు తీసి పంచాయతీ కార్యదర్శులు, గృహ నిర్మాణ శాఖ అధికారులు యాప్‌లో అప్‌లోడ్ చేసేవారు. అక్కడినుంచి అవి గృహనిర్మాణ శాఖ ఏఈకి లాగిన్ అయ్యేవి. ఆ తర్వాత డీఈ, పీడీ, కలెక్టర్ వరకు చేరేవి. పునాది పూర్తయితే రూ.లక్ష, స్లాబ్ లెవల్ గోడలకు మరో లక్ష, స్లాబ్ పూర్తయితే రూ.2లక్షలు, రంగులతో సహ ఇంటి నిర్మాణం పూర్తయితే రూ.లక్ష ఇలా మొత్తం రూ.5లక్షలు విడతల వారీగా బ్యాంకు ఖాతాల్లో జమ అవుతాయి. పంచాయతీ కార్యదర్శులు ఈ ప్రక్రియ పూర్తి చేయడంలో ఆలస్యం చేస్తుండడంతో ఇబ్బందులు తప్పడం లేదు. దీంతో లబ్ధిదారులు బిల్లుల కోసం ఎదురుచూసే పరిస్థితులు తలెత్తేవి. ఆ జాప్యాన్ని నివారించేందుకు ఇళ్ల నిర్మాణాలకు సంబంధించిన ఫొటోలు అప్‌లోడ్ చేసే అవకాశం వారికే కల్పించారు. దీంతో వారు తీసిన ఫొటోలను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, బిల్లులను వారి ఖాతాల్లో జమ అయ్యేలా చర్యలు తీసుకుంటారు. ఈ విధానంతో లబ్ధిదారులకు మేలు చేకూరుతుందని హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఇలా చేయాలి

మొదట స్మార్ట్ ఫోన్‌లో ఇందిరమ్మ ఇళ్ల యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. యూజర్ లాగిన్‌కు వెళ్లి పేరు, ఫోన్ నంబరు, గ్రామం తదితర వివరాలు నమోదు చేయాలి. ఇంటి నిర్మాణం ఏ దశలో ఉందో దాన్ని ఫొటో తీసి అప్‌లోడ్ చేయాలి. ఆ తర్వాత కోరిన వివరాలను పూర్తి చేస్తే ప్రక్రియ పూర్తయినట్టే. ఇంటికి సంబంధించిన వాస్తవచిత్రాలే అప్‌లోడ్ చేయాలి. లేదంటే క్షేత్రస్థాయిలో అధికారుల పరిశీలనలో విషయం బయట పడుతుందని గృహ నిర్మాణ శాఖ అధికారులు సూచిస్తున్నారు. కాబట్టి లబ్ధిదారులు యధార్థ ఫొటోలే పంపాల్సి ఉంటుంది. వాటిని పరిశీలించిన అనంతరం నగదు జమ చేస్తారు.

ఇళ్ల నిర్మాణ పనులు వేగంగా చేయాలి

మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు ముదిరాజ్



ఇంటి నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఏఎంసీ చైర్మన్ ఆంజనేయులు, స్థానికులు తదితరులు

కుల్కచర్ల: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు వేగంగా చేయించాలని కుల్కచర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ అంజనేయులు ముదిరాజ్ పేర్కొన్నారు. గురువారం కుల్కచర్ల మండలం ముజాహిద్‌పూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను ఆయన స్థానికులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా అంజనేయులు మాట్లాడుతూ..లబ్ధిదారులు నిర్మాణ పనులను త్వరగా చేయించుకోవాలని, చేసిన ప్రతీ పనిని అధికారులచేత రికార్డు చేయించుకోవాలని సూచించారు. ఇందిరమ్మ ఇంటి బిల్లుల చెల్లింపులో ఎలాంటి ఇబ్బందులు రానివ్వమన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సంతోశ్, నాయకులు చంద్రభూపాల్ రావు, బాలకృష్ణ, అంబు, నందు, షర్ఫొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి

సంఘం రాష్ట్ర నాయకుడు అశోక్‌కుమార్, పంచాయతీరాజ్ రాష్ట్ర కార్యదర్శి వెంకట్



కుల్కచర్ల: చౌడాపూర్‌లో వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

కుల్కచర్ల: అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలని సంఘం రాష్ట్ర నాయకుడు అశోక్ కుమార్, పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర కార్యదర్శి వెంకట్ పేర్కొన్నారు. ఈ నెల 28న కొండాయపల్లిలో నిర్వహించనున్న విగ్రహ ఆవిష్కరణను విజయవంతం చేయాలని కోరారు. గురువారం చౌడాపూర్ మండల కేంద్రంలో చలో కొండాయపల్లి వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..యువత అంబేడ్కర్ అడుగుజాడల్లో నడవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అశోక్‌కుమార్, నాయకులు మఠం రాజశేఖర్, పరిగి అశోక్, డీజే కుమార్, రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయంపై అవగాహన



సిరిగిరిపేట్‌లో అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ కళాశాల విద్యార్థులు

తాండూరు రూరల్: మండల పరిధిలోని సిరిగిరిపేట్‌లో సేంద్రియ వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించారు. హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల విద్యార్థులు, తాండూరు మండలం గ్రామీణ వికాస్ ఫౌండేషన్ సిరిగిరిపేట్‌లో ఎన్ఎస్ఎస్ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కళాశాల విద్యార్థులు గ్రామంలో పర్యటించి రైతులతో మాట్లాడారు. వ్యవసాయ సాగు పద్ధతులను తెలుసుకున్నారు. గ్రామానికి చెందిన సిద్దప్ప అనే రైతు సేంద్రియ వ్యవసాయంపై తన అభిప్రాయాన్ని వివరించారు. రాబోయే రోజుల్లో రైతులు సేంద్రియ వ్యసాయంపైనే మొగ్గు చూపుతారని శాస్త్రవేత్తలు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సతీశ్, డాక్టర్ ఎస్ నవీన్, వ్యవసాయ కళాశాల విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి



లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందిస్తున్న నాయకులు

కుల్కచర్ల: అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయనున్నట్లు డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి పేర్కొన్నారు. గురువారం కుల్కచర్ల మండల కేంద్రంలో రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్‌ను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదేళ్లలో గత బీఆర్ఎస్ సర్కారు ఒక్క ఇల్లు కూడా మంజూరు చేయలేదని, పేదోడి సొంతింటి కలను నెరవేర్చలేదన్నారు. తాము అధికారంలోకొచ్చి పేదోడి కలలను నెరవేర్చి, భవిష్యత్ భరోసాను కల్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీ కన్వీనర్ క్రిష్టారెడ్డి, మాజీ ఎంపీటీసీ ఆనందం, ఏఎంసీ డైరెక్టర్ రాంచంద్రయ్య, మాజీ సర్పంచ్ జోగు వెంకటయ్య, జిల్లా రజక సంఘం ప్రధాన కార్యదర్శి మోత్కూరు వెంకటేశ్, నాయకులు యాదయ్య, కొమ్ము శ్రీనివాస్, చాకలి కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు జూనియర్ కళాశాలలో సమావేశం

దోమ: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం విద్యార్థుల తల్లి దండ్రులకు సమావేశం నిర్వహిస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ రూపలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..కళాశాలలో విద్యార్థుల పురోగతి, హాజరు శాతం, చదవు వంటి విషయాలపై చర్చలు ఉంటాయన్నారు. భవిష్యత్‌లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, విద్యార్థులకు ఉపయోగపడే సలహాలను ఇవ్వనున్నామని చెప్పారు. ఈ సమావేశాన్ని ఉదయం 10 గంటలకు కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేస్తున్నామని, విద్యార్థుల తల్లిదండ్రులు సకాలంలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

సంగెంకలాన్‌కు రోహిత్‌రెడ్డి రాక

తాండూరు రూరల్: మండల పరిధిలోని సంగెంకలాన్ గ్రామానికి మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి వస్తున్నట్లు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం కోట్లాపూర్ గ్రామ సమీపంలోని శ్రీ రేణుక ఎల్లమ్మ అమ్మవారిని దర్శించుకుంటారు. ఆ తర్వాత సంగెంకలాన్ గ్రామంలో దుర్గాదేవి అమ్మ వారికి ప్రత్యేక పూజలు చేసి గ్రామంలోని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నారని పేర్కొన్నారు. కావున బీఆర్ఎస్ కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు.

పంటల నమోదు తప్పనిసరి

తాండూరు రూరల్: రైతులు సాగు చేసిన పంటల వివరాలను తప్పనిసరిగా నమోదు చేయించాలని తాండూరు వ్యవసాయశాఖ ఏడీఏ కొమురయ్య గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పంటల వివరాలను స్థానిక ఏఈవో వద్ద ఆన్‌లైన్లో నమోదు చేయించుకోవాలని సూచించారు. పంటల వివరాలు నమోదు చేయించకపోతే విక్రయించే సమయంలో ఇబ్బందులు తలెత్తుతాయన్నారు. కావున రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏడీఏ సూచించారు.

అంధత్వ నివారణకు కృషి



దృష్టిలోపం ఉన్నవారిని ఎనుగొండ ఆస్పత్రికి తరలిస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

కొడంగల్ రూరల్: అంధత్వ నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని లయన్ హరినాథ్ నెహ్రూ పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో లయన్స్ క్లబ్, జిల్లా అంధత్వ నియంత్రణ సంస్థ, వైద్య ఆరోగ్య శాఖల సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 46మందికి కంటి పరీక్షలు నిర్వహించగా 30మందికి దృష్టిలోపం ఉన్నట్లు గుర్తించారు. వారిని మహబూబ్‌నగర్ జిల్లాలోని ఎనుగొండ కంటి ఆస్పత్రికి తరలించారు.

సంప్రదాయానికి ప్రతీక బతుకమ్మ



తాండూరు టౌన్: బతుకమ్మకు పూజ చేస్తున్న మాణిక్యం, శరత్ చంద్ర



మోమిన్‌పేట: బతుకమ్మ ఆడుతున్న డ్వాక్రా మహిళలు

తాండూరు టౌన్: రాష్ట్ర పండుగ బతుకమ్మ పర్వదినాన్ని పురస్కరించుకుని పట్టణంలోని శాలివాహన డిగ్రీ కళాశాలలో గురువారం వేడుకలు వైభవంగా నిర్వహించారు. కళాశాల కరస్పాండెంట్ మోముల మాణిక్యం, ప్రిన్సిపాల్ శరత్‌చంద్ర, ఎస్ఐ పుష్పలతా రెడ్డి బతుకమ్మకు పూజలు నిర్వహించారు. అనంతరం విద్యార్థినులు పాటలు పాడుతూ ఉత్సాహంగా నృత్యాలు చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సంస్కృతి, సంప్రదాయానికి ప్రతీకగా బతుకమ్మ నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ డైరెక్టర్ సిద్ధి లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

మోమిన్‌పేట: మండల కేంద్రంలో ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ సంబరాలు అంబరానంటాయి. ఎంపీడీఓ విజయలక్ష్మి గౌరమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఆడి పాడారు. మొగుల్లవంపు వాగులో నిమజ్జనం చేశారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి

బీజేపీ సీనియర్ నాయకుడు పున్నంచంద్ లాహోటి



హస్నాబాద్‌లో నూతన బోరు వేయిస్తున్న బీజేపీ నాయకులు

దుద్యాల్: గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని కొడంగల్ నియోజకవర్గ బీజేపీ సీనియర్ నాయకుడు పున్నంచంద్ లాహోటి పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని హస్నాబాద్ గ్రామంలో నూతనంగా రెండు బోర్లను డ్రిల్లింగ్ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో కొంత కాలంగా తాగునీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుండడంతో ప్రభుత్వ బోర్లు అందుబాటులో లేక గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. ఇదే విషయమై గ్రామానికి చెందిన బీజేపీ ముఖ్య నాయకులు దత్తు సంజీవ, చెట్టుకింది శ్రీశైలం, గోవింద్ యాదవ్‌లు ఉమ్మడి మహబుబ్‌నగర్ జిల్లా ఎంపీ డీకే అరుణ దృష్టికి తీసుకెళ్లారు. సమస్య తీవ్రతను గుర్తించి గ్రామానికి రెండు నూతన బోర్లను మంజూరు చేయించారు. కొత్త ప్లాట్ల ప్రాంతంలోని పీర్ల మజీద్ వద్ద రెండు బోర్లను వేయించారు. వాటిని ఎంపీ ప్రత్యేక నిధులతో వేయిస్తున్నట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు గ్రామ సర్పంచ్ లక్ష్మా రెడ్డి, శ్రీకాంత్, రాజు, భాస్కర్, మనోజ్ రెడ్డి, అభినవ్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ గ్రామాలు కార్మికులతోనే సాధ్యం



ఏన్కతలలో పంచాయతీ కార్మికులను సన్మానించిన విజయలక్ష్మి తదితరులు

ఎంపీడీఓ విజయలక్ష్మి

మోమిన్‌పేట: స్వచ్ఛ గ్రామాలు పంచాయతీ కార్మికులతోనే సాధ్యమని ఎంపీడీఓ విజయలక్ష్మి పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని ఏన్కతల గ్రామంలో పంచాయతీ సిబ్బందిని సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేడు గ్రామాలు స్వచ్ఛతగా, పరిశుభ్రంగా ఉన్నాయంటే పంచాయతీ సిబ్బంది చొరవేనన్నారు. ప్రతిరోజు కొన్ని మీటర్ల వరకు మురుగు కాల్వలను శుభ్రం చేయాలని సూచించారు. ప్రతిరోజూ ఆయా ఇళ్లనుంచి చెత్త సేకరించాలన్నారు. ఐదారు సంవత్సరాల నుంచి ఎక్కడపడితే అక్కడ చెత్త వేయట్లేదన్నారు. ప్రతి ఇంటికి చెత్త బుట్ట అందజేసినట్లు చెప్పారు. గ్రామాలు నేడు చెత్త రహితంగా మారాయని అన్నారు. ఇదే విధంగా స్వచ్ఛతగా ఉండేందుకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ యాదగిరి, కార్యదర్శి నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

ఆదమరిస్తే అంతే సంగతి!

- గుంతలమయంగా బీటీ రోడ్డు
- ప్రమాదాల బారిన వాహనదారులు
- పట్టించుకోని అధికారులు



చన్గోముల్ సమీపంలో ధ్వంసమైన రోడ్డు

పూడూరు: చన్గోముల్–లాల్‌పహాడ్ వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డు గుంతలమయంగా మారి ప్రమాదకరంగా తయారైంది. ఈ దారిగుండా రాకపోకలు నిర్వహిస్తున్న వాహనదారులు పలుమార్లు ప్రమాదాల బారిన పడిన సందర్భాలు ఉన్నాయి. అయినప్పటికీ ఈ విషయాన్ని అధికారులు పట్టించుకోవడం లేదు. అంగడిచిట్టంపల్లి నుంచి లాల్‌పహాడ్, మన్నెగూడ చన్గోముల్ గ్రామాల వరకు కల్వర్టులు అధ్వానంగా తయారయ్యాయి. ఎక్కడ చూసినా గుంతలమయంగా మారడంతో పాటు వర్షానికి కల్వర్టులు సగానికి పైగా ధ్వంసమయ్యాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పాడైన రోడ్లను మరమ్మతు పనులు చేయించాలని కోరుతున్నారు.

దీన్‌దయాల్ సేవలు ఆదర్శనీయం



పరిగి: పండిత్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ అధ్యక్షురాలు అనసూయ

దేశంలోని యువత పండిత్ దీన్ దయాల్ సేవలను ఆదర్శంగా తీసుకోవాలని బీజేపీ నాయకులు పేర్కొన్నారు. గురువారం ఆయన జయంతి సందర్భంగా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు చిత్రపటానికి, విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ పండిత్ తన జీవితంలో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొన్నారన్నారు. ఆర్ఎస్ఎస్ స్థాపన సమయంలో మొదటి స్వయం సేవక్ సంఘ్‌లో ఒకరుగా ఉన్నారని గుర్తుచేశారు.



ధారూరు: లలితా త్రిపుర సుందరి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చిన అమ్మవారు



అనంతగిరి: వైభవలక్ష్మి ఆలయంలో కుష్మాండ దేవి రూపంలో దర్శనమిచ్చిన అమ్మవారు

కొనసాగుతున్న నవరాత్రోత్సవాలు



దౌల్తాబాద్: దుర్గామాత పూజలో భక్తులు



ధారూరు: దుర్గామాత విగ్రహానికి హారతి ఇస్తున్న మహిళలు

దేవిశరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్‌లో ఏర్పాటు చేసిన మండపాల్లో నిర్వాహకులు ప్రత్యేక పూజలు, సరస్వతీ పూజ, నిత్య కుంకుమార్చన, నిత్యారాధన, హోమాలను అర్చకులు నిర్వహించారు. గురువారం అమ్మవారు కాత్యాయనిదేవీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చింది. అక్కడికి వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అన్నదానం ఏర్పాటు చేస్తున్నారు.



దుద్యాల్: హకీంపేట్‌లో పూజలు అందుకుంటున్న దుర్గామాత